సీరియల్

వి.యస్.రావ్

(గత సంచిక తరువాయి)

ఇద్దరు వ్యక్తులూ—విభీషణ్, భరత్—పక్కపక్కనే ముడుచుకొని పడుకున్నారు. కాళ్ళవేళ్ళూ, చేతులవేళ్లూ వాచిపోయి, ఎర్రగా అవుపిస్తున్నాయి. గోళ్లు వుండాల్సినచోట ఎర్రటి పుళ్ళున్నాయి వాళ్ళ తలల దగ్గరా, పాదాల దగ్గరా రక్తం చుక్కల చుక్కలగా పడుంది. బోనులోకి వచ్చిన వ్యక్తి తమ శ్రేయోభిలాషి అని వాళ్ళు యెప్పుడో గుర్తించారు. ఇద్దరూ ఆవేశంతో లేచే ప్రయత్నం చేస్తూ ఆగారు.

మనోజ్ వాళ్ళని ఆశ్చర్యంతో చూశాడు. నాలుగు కాళ్ళమీద నించున్న జంతువుల్లా వున్నారిద్దరూ. గుండ్రటి ఇనుప రింగులు వాళ్ల మెడలచుట్టూ వున్నాయి. రింగులకి తగిలించబడిన లావుపాటి గొలుసులు కిందికి వేళ్ళాడు

తున్నాయి. గొలుసుల రెండో కొసలు నేలలోకి మాయమయ్యాయి.

మనోజ్ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దగా చేశాడు. వాళ్ళు వీళ్ళని యెలా హింసించారో తనకి తెలీదుగానీ, ఇద్దర్నీ పశువులకి మల్లే, కుక్కలకి మల్లే గొలుసులతో కట్టేశారు. రెండడుగులకన్నా తక్కువ పొడవున్న ఆ గొలుసులు వాళ్ళకి కూచునే అవకాశం కూడా ఇవ్వవు!

మనోజ్ కిందికి వొంగి లావుపాటి వ్యక్తి మెడకివున్న రింగుని తడివిచూశాడు. సైకిల్ తాళంలాగా, ఆ రింగుకి తాళం యేర్పాటు చేయబడింది.

“తాళం చెవులు యెవరిదగ్గరున్నాయో తెలుసా?” మనోజ్ మెల్లిగా అన్నాడు.

లావుపాటి వ్యక్తి తల అడ్డంగా ఆడించాడు. “ఎవరు మాకోసం వస్తే వాళ్ళ దగ్గర దేవి....” అతని కంఠం రాయిమీద రాస్తున్న తుప్పుపట్టిన డబ్బారేకులా ధ్వనించింది.

మనోజ్ బోనులోంచి ఇవతలికి వచ్చి, స్పృహ లేకుండా పడున్న వ్యక్తి దగ్గరగా వొంగాడు. అతన్ని అటూ ఇటూ దొర్లిస్తూ అతని చొక్కా జేబుల్లో, పాంటు జేబుల్లో వెతకసాగేడు. అతని జేబులన్నీ ఖాళీగా వున్నాయి. తాళాలకోసం వెతుకుతున్న మనోజ్ ఉలిక్కిపడ్డాడు.

ఏవో అడుగులు మెత్తగా, వేగంగా ధ్వనిస్తున్నాయి. అతను తటాలున తలెత్తి చూశాడు. అతని గుండె ఒక్కసారి కొట్టుకోడం మానేసింది.

ఇందాకా తను నడిచివచ్చిన నడవగుండా జోరుగా నడిచివస్తోంది ఎత్తుగా బలంగా వున్న బుల్ డాగ్....!

కింద అచేతనంగా పడున్న వ్యక్తి పాంటుజేబులోంచి కటాలున తన చేతిని ఇవతలికి లాగాడు మనోజ్. అప్పటికే బుల్ డాగ్ అతనికి నాలుగడుగుల దూరంలో వుంది.

మనోజ్ శిలావిగ్రహంలా కూచుండిపోయాడు. రెండు ఎర్రటి కళ్ళు నిప్పుకణాల్లా, కాలిన లోహం గోళీల్లా అతన్ని చూస్తున్నాయి. రక్తంలో ముంచినట్టున్న నాలుక కిందికి వేళ్ళాడుతోంది. బుల్ డాగ్ మొరగలేదు; తన యజమాని హెచ్చరించలేదు. శత్రువుని బెదిరించే ప్రయత్నం చేయలేదు.

ఎదురుగా వున్న శత్రువుని యెదుర్కొనగలిగిన ధైర్యం వున్న బుల్ డాగ్ మొరగదని మనోజ్ కి తెలుసు. తను కదలనంతకాలం అది తనని యేమీ చేయదు. కదిలితే, కదిలే ప్రయత్నంచేస్తే బుల్ డాగ్ తనమీదికి ఒక్కసారిగా సింహంలా లంఘిస్తుంది. ఏం జరుగుతోందో తను ఊహించేలోగా దాని పళ్ళమధ్య తన పీక ఇరుక్కుపోతుంది. నిశ్చయంగా, నిర్లక్ష్యంగా నించున్న బుల్ డాగ్ని చూస్తుంటే, అది బాగా ట్రెయిన్ చెయ్యబడిన జంతువులా ఖచ్చితంగా అర్థమవుతోందతనికి.

నుదురుమీంచి చెమట అతని కళ్ళమీదికి జారసాగింది. చొక్కా వీపుకి అతుక్కుపోతోంది. అప్రయత్నంగా మనోజ్ చెయ్యి కదిలింది.

బుల్ డాగ్ కొంచెం ముందుకి కదిలింది. దాని కళ్ళు అగ్నిగోళాల్లా మెరుస్తున్నాయి. తలుపు తెరిచిన బోనులో వున్న వాళ్ళిద్దరూ కంగారుతో యేవో అర్థంకాని శబ్దాలు చేస్తున్నారు. మనోజ్ ఆందోళనతో బుల్ డాగ్ నే చూస్తూ, ఆలోచిస్తూ వుండిపోయాడు. ఎన్నిగంటలైనా

బుల్ డాగ్ తనని కనిపెట్టి కాపలా కాస్తుందని అతనికి తెలుసు.

తను ఊహించని విధంగా రంగంలోకి అడుగు పెట్టిన బుల్ డాగ్ వల్ల తన శ్రమంతా వృధా అయ్యేలా వుంది.

బుల్ డాగ్ ని యెదుర్కోడానికి తను తయారుగానే వచ్చాడు. కానీ, ఈ విధంగా కాదు! నిమిషాలు గడిచి పోతున్నాయి. హాలు తలుపు తెరిచివుంచినందువల్ల బుల్ డాగ్ లోపలికి జొరబడింది. ఆలస్యం అయితే ఎవరైనా రావొచ్చు.

మొహమ్మీద కారుతున్న చెమటని తుడుచుకోవాలనిపిస్తోందతనికి. అసంకల్పితంగా అతని చెయ్యి కొంచెం పైకి లేచింది. బుల్ డాగ్ ఏదో సిగ్నల్ ని పాటిస్తున్నట్టు ముందుకి కదిలింది. మనోజ్ చెయ్యి అతని తొడమీద పడింది. బుల్ డాగ్ ఆగింది.

మనోజ్ రెప్పవేయకుండా బుల్ డాగ్ కళ్లలోకి చూస్తున్నాడు.

బుల్ డాగ్ అతన్ని ఎర్రగా, నిర్లక్ష్యంగా చూస్తోంది. దాని నిర్లక్ష్యం, అది పాటిస్తున్న నిశ్శబ్దం మనోజ్ ని ఆందోళనతో నింపుతున్నాయి. ఆరిపోతున్న పెదవుల్ని తడుపుకోడానికి అతను నాలుకను కదిపాడు. నాలుకకీ, అంగుడికీ మధ్య ఏదో అతుక్కున్నట్టుంది. పిప్పరమిట్!

శబ్దం కాకుండా మనోజ్ పిప్పరమిట్ ని చప్పరించసాగేడు. ఆరిపోతున్న నోరు యిప్పుడు హాయిగా వుంది. మనోజ్ ఉలిక్కిపడ్డాడు.

బుల్ డాగ్ ముక్కుపుటాలు గమ్మత్తుగా కదిలాయి. అది మెల్లిగా అతనివైపు అడుగులు వేయసాగింది. మనోజ్ కి గుండె రాయిలా మారిపోతున్నట్టనిపించింది.

చేతిలో యే ఆయుధాన్నీ వుంచుకోనందుకు అతను తనని తిట్టుకున్నాడు.

కనురెప్పల మీదికి జారుతున్న చెమటని విదిలిస్తూ రెప్పల్ని ఒకసారి మూశాడు. ఉన్నట్టుండి అతని శరీరం గగుర్పొడిచింది. అతని చేతులమీదా, మెడమీదా వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. ఏదో ఊపిరి వెచ్చగా అతని మొహానికి తగుల్తోంది. మనోజ్ కంగారులో కళ్ళు తెరిచాడు.

బుల్ డాగ్ మూతి అతని మొహానికి దగ్గరగా, చాలా దగ్గరగా వుంది. అదోవిధమైన వాసన అతని ముక్కుల్లోకి జొరబడుతోంది. గుండె డప్పులా మ్రోగడం ప్రారంభించింది. నోరు కొద్దిగా తెరిచి, ఊపిరితిత్తుల నిండా గాలి పీల్చుకొని వొగర్చడం ప్రారంభించాడతను.

బుల్ డాగ్ మూతి అతని పెదాలకి తగిలింది. ఏదో పసికడుతున్నట్టు ముక్కుని కదుపుతోందది. మనోజ్ మెదడులో ఏదో మెరుపులా మెరిసింది. అతనిలోని కంగారు తగ్గింది. బుల్ డాగ్ ని తన నోట్లో నానుతున్న పిప్పర్ మిట్ వాసన ఆకర్షించింది! దానికి తియ్యటి పిప్పర్ మెట్ కావాలి! గుడ్ గాడ్!

మనోజ్ అప్రయత్నంగా పిప్పరమిట్ ని నాలుక కొన మీదికి జరుపుతున్నాడు. మెల్లగా క్రిందపడేశాడు.

బుల్ డాగ్ వేగంగా పిప్పరమిట్ ని అందుకుంది. తృప్తికరంగా, వేగంగా బుల్ డాగ్ నములుతున్న చప్పుడు వినిపించిందతనికి.

మెల్లిగా .... మెల్లిగా .... కదలిక తెలీకుండా, స్లో మోషన్ లో మనోజ్ చెయ్యి కదిలించాడు. ఎన్నో గంటలు

గడిచాయని అతను అనుకుంటున్న క్షణాల్లో అతని చేతికి జేబులోని పిప్పరమెంట్స్ దొరికాయి. మెల్లిగా అతని చెయ్యి యివతలికి వచ్చింది.

బుల్ డాగ్ అతని నోటిని మళ్ళీ మూడ్డం ప్రారంభించింది. మనోజ్ రెండు పిప్పరమింట్లని అరచేత్తో దాని నోటిముందు వుంచాడు. బుల్ డాగ్ ఆత్రంలా వాటిని నాలుకతో లాక్కుంది. నాలుక తడి తగిలి మనోజ్ చెయ్యి వణికింది. బుల్ డాగ్ నోరు గరగర చప్పుడు చేస్తోంది.

చేతిలోంచీ అయిదారు పిప్పరమింట్లని గోడదాకా పొడుగ్గా చల్లాడు మనోజ్. అతని ఊహ నిజమైంది.

బుల్ డాగ్ తలవాల్చుకుని వాటిని అందుకుంటూ, నములూ ఏకాగ్రతతో ముందుకి వెళ్తోంది!

మనోజ్ మెరుపులా కదిలాడు. రెప్పపాటులో కటకటాల లోపలికి దూరి, తలుపు లాగేశాడు. బరువుగా నిట్టూరుస్తూ ఇద్దరు బందీలని చూశాడు.

వాళ్ళ మొహాల్లో ఆశ్చర్యం, ఆందోళనా కలిసి కనిపిస్తున్నాయి. వాళ్ళిద్దర్నీ చిరునవ్వుతూ చూస్తూ, మనోజ్ నడుంలో దోపిన డార్ట్ గన్ తీశాడు.

ఏదో శబ్దం అతని దృష్టిని ఆకర్షించింది. మనోజ్ తలతిప్పి చూశాడు.

బుల్ డాగ్ కటకటాల్ని ముందరి కాళ్లతో రాస్తూ అతన్నే ఆశగా చూస్తోంది. మనోజ్ జేబులో మిగిలిన పిప్పరమింట్స్‌ని కటకటాలగుండా దూరంగా విసిరాడు. బుల్ డాగ్ నూతనోత్సాహంతో వాటిమీదికి విజృంభించింది. మరుక్షణం డార్ట్ బుల్ డాగ్ మెడలో లోతుగా గుచ్చుకుంది. తృప్తికరంగా పిప్పరమెంట్స్ నములుతున్న

పక్క మెల్లగా కిందికి వాలిపోయింది.

మనోజ్ వెనుదిరిగాడు. సైలెన్సర్ అమర్చిన రివాల్వర్ని సంచీలోంచి తీశాడు.

“మీ గొలుసుల్ని తూటాలతో తెగ్గొడతాను, కదలకుండా వుండాలి!” అన్నాడు వాళ్ల దగ్గరగా నడుస్తూ.

“జాగ్రత్త” లావుపాటి వ్యక్తి బొంగురుగా అన్నాడు.

“త్వరగా.... ఈ నరకంలోంచి బైటపడాలి!” అతని సహచరుడు ఆదుర్దాగా అన్నాడు.

మనోజ్ చేతిలోని రివాల్వర్ రెండుసార్లు సన్నగా చప్పుడు చేసింది. ఇద్దర్నీ బంధించిన గొలుసులు నేల మీద చచ్చిన పాముల్లా పడున్నాయి. కంఠానికి తగిలిన కడియాల్లా రింగులు వాళ్ళ మెడల్ని ఇంకా చుట్టే ఉన్నాయి. ఇద్దరూ పక్కపక్కనే నిలబడి అటూ ఇటూ తూలుతున్నారు.

“నువ్వు ...” లావుపాటి వ్యక్తి విభీషణ్ అనుమానిస్తూ ఆగాడు.

“పరిచయాలు తరవాత. ముందు ప్రాణాలు దక్కించుకోండి!” అంటూ మనోజ్ ముందు హాల్లో టేబుల్ మీంచీ తీసుకున్న రెండు రివాల్వర్లని వాళ్ళకి చెరొకటి ఇచ్చాడు. “అడ్డొచ్చినవాళ్ళని అంతం చేయండి! కమాన్ !”

మనోజ్ సన్నటి నడవమ్మట పరుగు ప్రారంభించాడు.

సాధారణ పరిస్థితిలో వాళ్ళిద్దరూ పరుగెత్తలేరని అతనికి బాగా తెలుసు. వాళ్ళ కాళ్ళ వేళ్ళు పచ్చడి చేయబడ్డాయి. కానీ ఇది సాధారణ పరిస్థితి కాదు!

వొగురుస్తూ పరుగెడుతున్న వాళ్ళ అడుగుల చప్పుడు వింటూ మనోజ్ వేగంగా వెళ్ళసాగాడు.

• • •

ఎవ్వరూ ఎదురవనందుకు సంతోషిస్తూ మనోజ్ తోటలోకి వెళ్ళే చివరి తలుపుముందు ఆగాడు.

కేసీపట్లో ఇద్దరి వొగుర్పులూ వెనకనుంచీ అతనికి వినిపించాయి. లోపల ప్రవేశించేటప్పుడు తను తలుపుకి చేసిన కన్నం దగ్గరగా చెవిని వుంచి క్షణకాలం జాగ్రత్తగా విన్నాడతను. చల్లటి గాలి అతని చెవిని తాకుతోంది.

మనోజ్ నిలబడి, వాళ్ళవైపు తిరిగాడు. "ఈ తలుపు తీశాక మెట్లు దిగి, తోటలోకి ప్రవేశించాలి. చీకట్లో నా వెంట మీరు జాగ్రత్తగా, వేగంగా పరుగెత్తాలి' తాడమ్మట గోడపైకి ఎగబాకాలి. అవతలివైపుకి దిగాలి' ఆ తరవాత...."

"తరవాతది తరవాత. ముందు ఇక్కణ్ణుంచీ వెళ్ళిపోవాలి!" సన్నటి వ్యక్తి, షరత్ అడ్డొస్తూ అన్నాడు.

"తరవాత, నేను ఆగేదాకా మీరు పరుగెత్తుతూనే వుండాలి!" అతని మాట వినిపించుకోకుండా అన్నాడు మనోజ్. మెల్లిగా తలుపుని కొంచెం లాగాడు. తల దూర్చి ఆవేపు చీకట్లోకి చూస్తూ వుండిపోయాడు.

"కమాన్!" అంటూ తలుపుని మరికొంచెం తెరిచి, మెట్లమ్మట కిందికి దిగసాగాడు. ఇద్దరూ నీడల్లా అతన్ని వెంబడించారు.

లావుగా పొట్టిగా వున్న విభీషణ్ మనోజ్ని అంటిపెట్టుకుని, అతని వెనక బుల్ డాగ్ లా పరుగెడుతున్నాడు. ఇద్దరికీ మూడడుగుల దూరంలో వెనగ్గా భరత్ పరుగెడుతున్నాడు.

ఎడంవేపునుంచీ చూసుకొస్తున్న ఆకారాన్ని వాళ్ళెవ్వరూ చూడలేదు. కవాతు చేస్తున్న సైనికుల అడుగుల చప్పుడు లా-గడ్డిలో మెత్తగా ధ్వనిస్తున్న తమ

అడుగుల శబ్దం మూలంగా తమ పక్కనుంచీ వస్తున్న మెత్తటి అడుగుల శబ్దాన్ని ఎవ్వరూ వినలేదు.

చిన్న మొక్క పైనుండీ అటువేపు జాగ్రత్తగా దూకబోయిన భరత్ అసంకల్పితంగా కెవ్వుమన్నాడు. వెనకవైపున వున్న అతని కుడికాలు యేదో చట్రంలో బిగుసుకున్నట్టనిపించింది. తూలిపడబోతూ, ఆగి, అతను తన కాలివైపు కంగారుగా చూశాడు.

పిక్కలోంచీ యేదో మంట. సలుపు జరజరా పాకుతున్నాయి. తన కాలికి బంతిలా కరుచుకుని, బలంగా లాగుతున్న అల్సేషియన్ డాగ్‌ని అతను ఆందోళనతో చూశాడు. బలంగా కాలు విదిల్చాడు. పిక్కలోకి పళ్ళు లోతుగా దిగుతున్నాయి. భరత్ మళ్ళీ చిన్నగా అరిచాడు.

తన చేతిలోని రివాల్వర్ అతనికి తటాలున గుర్తొచ్చింది. కొద్దిగా కిందికి వొంగి, రివాల్వర్‌ని కుక్క తలకి గురిచూసి, కంగారుగా అతను ట్రిగ్గర్ నొక్కాడు.

చెవులు పగిలేలా చప్పుడైంది. రంపం పళ్ళు అతని కాలిమీద వదులయ్యాయి. అల్సేషియన్ నిర్జీవంగా గడ్డి నేలమీదికి వాలిపోయింది. చెమటలు కక్కుతూ, భరత్ పరుగు ప్రారంభించాడు.

రివాల్వర్ షాట్ విని, మనోజ్ తటాలున ఆగాడు. అతన్ని ఢీకొట్టుతూ విభీషణ్ వొగరుస్తూ నిలబడ్డాడు. కుంటుతూ తమవేపు వస్తున్న భరత్‌ని మనోజ్ గాభరాగా చూశాడు. గోడ నాలుగడుగుల దూరంలో వుంది. రివాల్వర్ శబ్దాన్ని భవనం ముందున్న వ్యక్తులు విని వుంటారు. ఛాండాలుడు! భరత్‌ని తిట్టుకుంటూ, మనోజ్ విభీషణ్‌ని గోడవైపు తోశాడు.

"కమాన్! అదిగో తాడు. పైకి పాకు!" మనోజ్ అరిచాడు, తగ్గుస్వరంలో.

తెప్పరిల్లిన విభీషణ్ గోడని సమీపించి, తాడు పట్టుకుని గబగబా పైకి పాకసాగేడు. మనోజ్ ఆత్రంగా భరత్ వైపు చూశాడు. అతనింకా పదడుగుల దూరంలో వున్నాడు. మనోజ్ క్షణంలో ఒక నిశ్చయానికి వచ్చి, తాడువైపు గెంతేశాడు. విభీషణ్ గోడమీద పిల్లిలా వున్నాడు. మనోజ్ తాడుని పట్టుకుని పైకి పాకసాగేడు.

భవనం ముందువైపునుంచీ యేవో కేకలు వినిపిస్తున్నాయి. మనోజ్ గోడ పైభాగాన్ని సమీపించాడు. అతను దగ్గరకు రాగానే విభీషణ్ అమాంతం గోడ మీంచీ కిందికి దూకేశాడు. అతని ధైర్యానికీ, శక్తికీ ఆశ్చర్యపోతూ మనోజ్ గోడమీదికి చేరుకొని, తలని కిందికి వాల్చాడు. భరత్ తాడుని పట్టుకుంటూ పైకి చూస్తున్నాడు.

"కమాన్! కచ్చెయ్!" అంటూ మనోజ్ వేళ్ళతో గోడని పట్టుకొని అటువైపు కిందికి వేళ్ళాడాడు. పది అడుగుల గోడనుంచీ అయిదడుగుల పొడవుతో తను వేళ్ళాడుతున్నాడు. నేల తన పాదాలకి అయిదడుగుల దూరంలో వుంది. మనోజ్ వేళ్ళని వదులు చేస్తూ కిందికి దూకేశాడు.

అతని పక్కనే, విభీషణ్ కొలిమి తిత్తిలా బుస కొడుతూ నిలబడ్డాడు. మనోజ్ ఆదుర్దాతో పైకి చూస్తున్నాడు. కాసేపట్లో భరత్ నీడలా గోడమీద ప్రత్యక్షమయ్యాడు. ఆల్సేషియన్ అతన్ని గాయపరిచిందని మనోజ్ కి తెలుసు. అతను కిందికి దూకగలడా?

(సశేషం)